క్లుప్తంగా

2న మద్యం, మాంసం విక్రయాలు నిషేధం

పొన్నూరు: రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు అక్టోబర్ 2వ తేదీన గాంధీ జయంతి పురస్కరించుకుని పట్టణంలో చికెన్, మటన్, చేపల విక్రయాలను నిషేధించినట్లు మున్సిపల్ కమిషనర్ ముప్పాళ్ల రమేష్‌బాబు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పొన్నూరు ఎక్సైజ్ కార్యాలయం పరిధిలోని బార్ అండ్ రెస్టారెంట్లు, వైన్ షాపులలో అక్టోబర్ 2న మద్యం విక్రయాలు నిలుపుదల చేయాలని ఎక్సైజ్ సీఐ రమేష్ తెలిపారు. గురువారం మద్యం విక్రయాలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నిర్వాహకులు ఎక్సైజ్ శాఖ సూచనలు తప్పక పాటించాలని తెలిపారు.

ఎంఆర్ఎఫ్ టైర్స్ షోరూం ప్రారంభం



పొన్నూరు: పట్టణంలోని ఆర్టీసీ డిపో సమీపంలో ఎంఆర్ఎఫ్ టైర్స్ నూతన షోరూం ప్రారంభమైంది. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా కంపెనీ జిల్లా మేనేజరు కోసిరెడ్డి ఈశ్వర్ పాల్గొని షోరూంను ప్రారంభించారు. ఈ సందర్భంగా మేనేజరు మాట్లాడుతూ షోరూంలో అన్ని రకాల వాహనాలకు సంబంధించిన టైర్లు అందుబాటులో ఉంటాయని తెలిపారు. కార్యక్రమంలో కంపెనీ డీలర్, అయ్యప్ప టైర్స్ ప్రొప్రయిటర్ తాళ్లూరి హరీష్ బాబు, భాస్కరరావు, మల్లేశ్వరరావు, మధు, వేణు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా దేవి శరన్నవరాత్రి మహోత్సవాలు

గుంటూరు రూరల్: వర్సటైల్ సర్వీసెస్ ట్రస్ట్, శ్రీకృష్ణ అకాడమీ, కనకదుర్గ భవాని ఫ్రెండ్ సర్కిల్ ఆధ్వర్యంలో నాయుడుపేటలో ద్వితీయ దేవి శరన్నవరాత్రి మహోత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నారు. మంగళవారం అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, హోమాలను నిర్వహించారు. వర్సటైల్ సర్వీసెస్ ట్రస్ట్ చైర్మన్ పాశం శ్రీకృష్ణదేవరాయ యాదవ్ మాట్లాడుతూ దసరా అనేది దుర్గామాత శక్తి రూపాలను ఆరాధించే ఒక హిందూ పండుగని, ఇది చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకని తెలిపారు. ప్రత్యేక పూజలు నిర్వహించి స్థానిక విద్యార్థులకు ఎగ్జామినేషన్ ప్యాడ్స్, నోట్ బుక్స్, పెన్సిల్ కిట్స్ పంపిణీ చేశారు.
కార్యక్రమంలో విద్యార్థుల కోలాటం, నృత్య ప్రదర్శనలు ప్రేక్షకులను అలరించాయి. ట్రస్టు సభ్యులు పాశం సర్దార్ అభినంద్ యాదవ్ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు కళా రంగాల్లోనూ ప్రతిభ కనబరచాలని, విద్యలో రాణించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు కోటిరెడ్డి, కోటేశ్వరరావు, శివాజీ, తోట రవి, మధు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

తెనాలి: నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటైన కార్యక్రమంలో ఆరుగురు లబ్ధిదారులకు వైద్యచికిత్సల నిమిత్తం రూ.5,35,959 చెక్కులను ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు మహమ్మద్ ఖుద్దూస్, సహకార అర్బన్ బ్యాంక్ చైర్మన్ మంగమూరి హరిప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

వెంకట రమణారావుకు అభినందన



తెనాలి: పట్టణానికి చెందిన మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ తోటకూర వెంకట రమణారావు విజయవాడలోని శ్రీకనకదుర్గ దేవస్థానం పాలకవర్గ సభ్యుడిగా నియమితులైన సందర్భంగా మంగళవారం ఆయన్ను హిందూ ధార్మిక సంస్థలు సత్కరించాయి. విశ్వహిందూ పరిషత్, హిందూ చైతన్య వేదిక ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేశారు. విశ్వహిందూ పరిషత్ పట్టణ అధ్యక్షుడు కోట రాజేష్, కార్యదర్శి రామాంజనేయులు, హిందూ చైతన్య వేదిక సంయోజక పొట్టి మూర్తి, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

యువతి అదృశ్యంపై కేసు నమోదు

తెనాలి రూరల్: యువతి అదృశ్యంపై కేసు నమోదైంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. పట్టణ చెంచుపేట ఇందిరానగర్ కాలనీకి చెందిన 22 ఏళ్ల యువతి సెప్టెంబర్ 26న విజయవాడలో కోచింగ్‌కి వెళుతున్నాని చెప్పి ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబసభ్యులు పోలీసులను ఆశ్రయించగా త్రీ టౌన్ పోలీసులు కేసు మంగళవారం నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

డిజిటల్ బుక్‌తో పార్టీ శ్రేణులకు భరోసా

వైఎస్సార్‌సీపీ పొన్నూరు నియోజకవర్గ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ



చేబ్రోలులో డిజిటల్ బుక్ క్యూఆర్ కోడ్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న పొన్నూరు నియోజకవర్గ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ తదితరులు

చేబ్రోలు: కూటమి ప్రభుత్వ ఆగడాలతో ఇబ్బందులు పడుతున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులకు భరోసా ఇచ్చేందుకే డిజిటల్ బుక్‌ను మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి రూపొందించారని వైఎస్సార్‌సీపీ పొన్నూరు నియోజకవర్గ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ అన్నారు. మండల కేంద్రమైన చేబ్రోలులో మంగళవారం డిజిటల్ బుక్ క్యూఆర్ కోడ్ పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అంబటి మురళీకృష్ణ మాట్లాడుతూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, సోషల్ మీడియా వారిపై కూటమి నాయకుల దాడులు, అక్రమ కేసుల బనాయింపులు పెరిగిపోయాయన్నారు. అలాంటి వారి వివరాలను బాధిత వైఎస్సార్‌సీపీ శ్రేణులు క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి డిజిటల్ బుక్‌లో నమోదు చేయాల్సి ఉంటుందన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత బాధ్యులపై చట్టపరంగా చర్యలు తీసుకునే వరకు వదిలిపెట్టే ప్రసక్తి లేదన్నారు. డిజిటల్ బుక్ పార్టీ శ్రేణులకు అండగా నిలుస్తుందన్నారు. కూటమి 15 నెలల పాలనలోనే రైతులు, ప్రజలు రోడ్లెక్కి ధర్నాలు చేస్తున్నారని అన్నారు. ఉల్లి, టమాటా, ఇతర పంటలకు సరైన ధరలు లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం పేద విద్యార్థులకు వైద్య విద్యను దూరం చేస్తోందన్నారు. రెడ్ బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తున్న కూటమి ప్రభుత్వానికి త్వరలోనే చరమగీతం పాడేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. రాబోయే వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఇప్పుడు ఇబ్బందిపెట్టిన కూటమి నేతలు, అధికారులను చట్ట పరిధిలో శిక్షిస్తామన్నారు. కార్యక్రమంలో మండల పరిషత్ ఉపాధ్యక్షుడు పసుపులేటి శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు ఆళ్ల శ్రీరామరెడ్డి, పార్టీ నాయకులు, పార్టీ అనుబంధ సంఘాల నాయకులు కె.ముత్యమేశ్వరరావు, అన్నదాసు సుబ్బారావు, రావిరాల శ్రీదేవి, అల్లం వెంకట్రామయ్య, కొల్లి శేషిరెడ్డి, గాదె సుమలత, పల్లెపాటి కోటేశ్వరరావు, యాతం మమత, దాసరి దనమ్మ, పోతురాజు, పోలేశ్వరరావు, పరిశా చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.



పెదకాకానిలో డిజిటల్ బుక్ క్యూర్ కోడ్‌ను ఆవిష్కరిస్తున్న సమన్వయకర్త అంబటి

కార్యకర్తలు, ప్రజలకు అండగా డిజిటల్ బుక్

పెదకాకాని: కూటమి పాలనలో రెడ్ బుక్ రాజ్యాంగంతో అన్యాయానికి గురయ్యే వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, సామాన్య ప్రజలకు అండగా ఉండేందుకే వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి డిజిటల్ బుక్ ప్రవేశపెట్టారని వైఎస్సార్‌సీపీ పొన్నూరు నియోజకవర్గ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ అన్నారు. పెదకాకానిలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో మండల నాయకులతో కలిసి మంగళవారం రాత్రి అంబటి మురళీకృష్ణ డిజిటల్ బుక్ క్యూఆర్ కోడ్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సమావేశానికి పార్టీ మండల అధ్యక్షుడు ముడియాల మల్లికార్జునరెడ్డి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా అంబటి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధిని మరిచి కక్ష సాధింపు రాజకీయాలు చేస్తుందని మండిపడ్డారు. అధికారంలోకి వచ్చిన నాటి నుంచి కూటమి నాయకులు వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలే లక్ష్యంగా వారిపై అక్రమ కేసులు పెట్టి వేధిస్తున్నారని ఆరోపించారు. పార్టీ కార్యకర్తలకు అండగా ఉండేందుకు వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్ ప్రవేశపెట్టిన డిజిటల్ బుక్‌లో కూటమి నాయకులు చేస్తున్న అరాచకాలు, అన్యాయాలను పొందుపరచాలని పార్టీ నాయకులు, కార్యకర్తలకు సూచించారు. ప్రతి సామాన్య కార్యకర్తకూ పార్టీ అండగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు గోళ్ళ జ్యోతి, పార్టీ నాయకులు తాడిబోయిన వేణుగోపాల్, సుంకర కృష్ణారెడ్డి, మందాళ శివారెడ్డి, కొండమడుగుల శ్రీనివాస రెడ్డి, వెంకటరెడ్డి, జొన్నల శివారెడ్డి, తోటకూర వెంకటేశ్వరరావు, కానుగోలు శంకరరావు, పఠాన్ మస్తాన్, ఆలా శ్రీనివాసరావు, వేల్పుల నాగరాజు, వీర్ల వీరాంజనేయులు, షేక్ నజీర్ అహ్మద్, చాగంటి మురళీమోహన్‌రెడ్డి, సుంకర నర్సిరెడ్డి, బండ్లమూడి బాను, దంతాల శ్రీనివాసరావు, ఎస్కే గౌస్, పెనుమాల అరుణ్, గద్దెల ప్రకాష్, కాళింత నాగేశ్వరరావు, ఎస్కే జానీ, కూచిపూడి నాగరాజు, గైడు తదితరులు పాల్గొన్నారు.

దుర్గాదేవి.. నమోస్తుతే!



పొన్నూరు కోదండ రామాలయంలో...



రాజరాజేశ్వరిదేవిగా అమ్మవారు



నంబూరు నాగారపమ్మ దేవాలయం ఆవరణలో...



పెదకాకాని రామాలయం వద్ద దుర్గాదేవిగా...

పొన్నూరు: పొన్నూరులో దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. మంగళవారం పలు ఆలయాల్లో అమ్మవారిని విశేషంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పట్టణంలోని తెలగపాలెం కోదండ రామాలయంలో అమ్మవారు దుర్గాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ అర్చకులు చిలకపాటి లక్ష్మణ్ రామాచార్యులు పూజలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

రాజరాజేశ్వరిగా అమ్మవారు

గుంటూరు రూరల్: మండలంలోని నల్లపాడు గ్రామంలో స్వయంభూ పుష్పాద్రి లక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలో దసరా నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. మంగళవారం రాజరాజేశ్వరి సమేత ఆకాశ మల్లేశ్వరస్వామి దేవస్థానంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు, హోమాలను నిర్వహించారు. కార్యక్రమంలో చండీహోమం, మధ్యాహ్నం అన్న సంతర్పణ నిర్వహించారు. దసరా పర్వదినాన్ని పురస్కరించుకుని అక్టోబర్ 2వ తేదీ గురువారం ఉదయం 9 గంటలకు సెమీ పూజ జరుగుతుందని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. భక్తులు విశేషంగా పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

చేబ్రోలు మండలంలో...

చేబ్రోలు: చేబ్రోలు మండలంలో దేవి శరన్నవరత్రి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం వివిధ గ్రామాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. చేబ్రోలు మండలం నారాకోడూరులోని శ్రీలక్ష్మీ పద్మావతీ సమేత వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో అమ్మవారు దుర్గాదేవి అలంకారంలో దర్శనమిచ్చారు. మంచాల గ్రామంలోని ఆదిలక్ష్మి కామేశ్వరి అమ్మవారు ప్రత్యేక అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. పాతరెడ్డిపాలెం గ్రామంలో దుర్గామాతగా అమ్మవారు దర్శనమిచ్చారు. ఆయా చోట్ల పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

వైభవంగా దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు

పెదకాకాని: దసరా ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. పెదకాకాని మండలంలోని గ్రామాల్లో కనకదుర్గ అమ్మవారి విగ్రహాలను ఆలయ ప్రాంగణాల్లోనూ, ప్రత్యేకంగా అలంకరించిన పందిళ్లలోనూ ఏర్పాటు చేశారు. ప్రతి రోజూ అమ్మవారిని ఒక అలంకారంలో అలంకరించి పూజలు చేస్తున్నారు. గ్రామాల్లో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. ఈ ఉత్సవాల్లో భాగంగా మంగళవారం నంబూరు నాగారపమ్మ ఆలయ ప్రాంగణంలో ఎస్‌బీఆర్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కనక దుర్గ అమ్మవారు దుర్గాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. రాత్రి డ్యాన్స్ బేబి డ్యాన్స్, కూచిపూడి నృత్యం, కోలాట ప్రదర్శనలు వంటి కార్యక్రమాలు నిర్వహించారు. పెదకాకాని నగరపాలెం రామాలయం వద్ద ఏర్పాటు చేసిన అమ్మవారిని దుర్గాదేవిగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. నిర్వాహకులు పూజా కార్యక్రమాల అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.



చేబ్రోలు మండలం నారాకోడూరులో...



చేబ్రోలు మండలం పాతరెడ్డిపాలెం గ్రామంలో...



చేబ్రోలు మండలం మంచాల గ్రామంలో...



వెగిగండ్ల నాంచారమ్మ ఆలయం వద్ద...

పంట నష్టపరిహారం అందించాలి



నీట మునిగిన పంట పొలాలను పరిశీలిస్తున్న కౌలు రైతు సంఘం నేతలు

దుగ్గిరాల: మినుము, కంద, పసుపు పంట రైతులు కృష్ణా నది ముంపునకు గురై దెబ్బతిన్నాయని, నష్ట పరిహారం అందించి రైతులను కష్టాల నుంచి విముక్తులను చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఈమని అప్పారావు అన్నారు. మంగళవారం దుగ్గిరాల మండలం పెదకొండూరు, వీర్లపాలెంలో కృష్ణానది ముంపునకు గురైన పంట చేలను కౌలు రైతు సంఘం జిల్లా నాయకుల పరిశీలించారు. అనంతరం అప్పారావు మాట్లాడుతూ సుమారుగా మినుముకు రూ.10 వేలు, పసుపు సాగుకు రూ.40 వేలు ఖర్చు అయ్యాయని తెలిపారు. వరద ముంపు కారణంగా నీరు ఎక్కువ రోజులు నిలబడితే దుంప కుళ్లే ప్రమాదం ఉందని, పంట పూర్తిగా దెబ్బతిని పోతుందని చెప్పారు. పసుపు పంటకు రూ.50 వేలు, మినుప పంటకు రూ.10 వేలు నష్ట పరిహారం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో జెట్టి బాలరాజు, మన్నవ నాగమల్లేశ్వర రావు, వై.బ్రహ్మేశ్వరరావు, బి.అమ్మిరెడ్డి, యాకోబు, బుల్లాబ్బాయి, సుబ్బారావు, నాగిరెడ్డి పాల్గొన్నారు.

అలరించిన భక్తి సంగీత విభావరి



గాయకుల గీతాలాపన

నగరంపాలెం: స్థానిక బృందావన్‌గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణం అన్నమయ్య కళావేదికపై దసరా మహోత్సవాల్లో భాగంగా మంగళవారం భక్తి సంగీత విభావరి నిర్వహించారు. సాయిమారుతీ భజన మండలి ఆధ్వర్యంలో జరగ్గా, పాలక మండలి నిర్వాహకులు జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించారు. గాయకులు వి.మల్లేశ్వరరావు బృందం పలుభక్తి గీతాలు శ్రావ్యంగా ఆలపించారు. కీబోర్డుపై షరీఫ్, తబలాపై విజయ్‌పాల్ వాయిద్యాని అందించారు. అనంతరం కళాకారులను ఆలయ కమిటీ సభ్యులు సత్కరించారు.

ప్లాస్టిక్ కవర్లు విక్రయిస్తే చర్యలు

మున్సిపల్ కమిషనర్ రమేష్‌బాబు



పొన్నూరు: పురపాలక సంఘ పరిధిలో ప్లాస్టిక్ నిషేధం అమలులో ఉందని, వ్యాపారులు ప్లాస్టిక్ కవర్లు విక్రయిస్తే చర్యలు తప్పవని మున్సిపల్ కమిషనర్ ముప్పాళ్ల రమేష్‌బాబు అన్నారు. మంగళవారం పట్టణంలోని పలు ప్రాంతాల్లో ఆయన పర్యటించారు. 21వ వార్డు ఎస్పీపీ రోడ్డులోని ఓ దుకాణంలో నిర్వహించిన ఆకస్మిక తనిఖీలలో విక్రయానికి ఉంచిన నిషేధిత ప్లాస్టిక్ వస్తువులను గుర్తించారు. 132 కిలోల ప్లాస్టిక్‌ను సీజ్ చేశారు. తనిఖీలలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, మున్సిపల్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాల అభివృద్ధికి పూర్వ విద్యార్థుల కృషి



మాట్లాడుతున్న సంఘం ప్రధాన కార్యదర్శి నంబూరు నాగేశ్వరరావు

పెదకాకాని: శ్రీ ప్రోలయ వేమన జిల్లా పరిషత్ పాఠశాల అభివృద్ధికి విశేషంగా కృషి చేస్తున్నామని పూర్వ విద్యార్థుల సంఘం ప్రధాన కార్యదర్శి నంబూరు నాగేశ్వరరావు అన్నారు. మండలంలోని నంబూరు ఎస్పీపీ జెడ్పీహెచ్ స్కూల్ పూర్వ విద్యార్థుల సంఘం కార్యాలయంలో మంగళవారం సమావేశం జరిగింది. ఈ సమావేశానికి అధ్యక్షుడు ఈమని ప్రతాపరెడ్డి అధ్యక్షత వహించగా, సంఘం ప్రధాన కార్యదర్శి నంబూరు నాగేశ్వరరావు మాట్లాడుతూ కమిటీ ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు ఘనంగా ప్లాటినం జూబ్లీ వేడుకలు జరిగాయన్నారు. ఈ వేడుకలకు గుర్తుగా పాఠశాలలో నూతన భవనం నిర్మించడంతో పాటు విద్యార్థులకు సౌకర్యవంతంగా సిమెంట్ ఫ్లోరింగ్ చేయించడం జరిగిందన్నారు. అన్ని విధాలా నిబంధనల ప్రకారం నూతన కమిటీ ఏర్పడిందన్నారు. కొందరు వ్యక్తులు వ్యక్తిగత స్వార్థంతో పదవుల కోసం నూతన కమిటీపై అసత్య ప్రచారాలు చేస్తున్నారని, అటువంటి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడంతో పాటు పరువు నష్టం కేసు వేయడం జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో పూర్వ విద్యార్థుల సంఘం గౌరవ అధ్యక్షుడు తాలాబంధుల తాతయ్య, ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులు పి.చిరంజీవి, అన్నపురెడ్డి బ్రహ్మారెడ్డి, పలువురు పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

బొమ్మువానిపాలెంలో వింత పాములు



బొమ్ము వానిపాలెం పాలెం గ్రామంలోకి వచ్చిన రెండు తలల పాములు

కొల్లిపర: కృష్ణానదిలో వరద ఉధృతి కారణంగా బొమ్మువానిపాలెం గ్రామంలోకి మంగళవారం రెండు తలలతో ఉన్న వింత పాములు వరద నీటితో పాటు గ్రామంలోకి కొట్టుకువచ్చాయి. వాటిని చూసి గ్రామంలో గతంలో ఎన్నడూ ఇటువంటి వింత పాములను చూడలేదని గ్రామస్తులు తెలిపారు. యువకులు ధైర్యం తెచ్చుకుని వాటిని ఒక గోని సంచిలో బంధించి మండల స్థాయి అధికారుల దృష్టికి తీసుకువెళ్లి అటవీశాఖ అధికారులకు సమాచారం అందించి, వాటిని అప్పగించారు. గ్రామంలో రెండు తలల పాములు కన్పించాయన్న సమాచారం వ్యాపించడంతో చుట్టుపక్కల గ్రామాల వారు వాటిని చూడటానికి ఎగబడ్డారు. వాటిని ఫొటోలు తీసుకున్నారు.